క్లుప్తంగా

92 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణ

ఏలూరు (టూటౌన్) : స్థానిక ఆర్ఆర్‌పేటలోని శ్రీ కృష్ణ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో 92 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఆరోగ్య సలహాలు, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డాక్టర్ బి.కృష్ణ మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం తమ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రోగులకు అవసరమైన రక్త పరీక్షలు, బీఎండీ (ఎముకల సాంద్రత) స్కానింగ్, ఎక్స్‌రే ఉచితంగా చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, టెక్నికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స



ఆయుర్వేద మందులు పంపిణీ చేస్తున్న వేణుబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆయుర్వేద వైద్య విధానంలో అనేక దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స ఉందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బీబీఎం నగేష్ అన్నారు. ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 88 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, క్లబ్ సభ్యులు బొలిశెట్టి సురేష్ కుమార్, పరస శ్రీనివాస్, చెన్నా వెంకట్రామయ్య, పిల్లి పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

12వ డివిజన్ సమస్యలపై వినతి

ఏలూరు (టూటౌన్): స్థానిక 12వ డివిజన్‌లో నివసిస్తున్న 64 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, పారిశుధ్యం, మంచినీరు, పార్కు, వ్యాయామశాల, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఏలూరు జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడుకు స్థానికులు శనివారం వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని చిన్నపాటి వర్షానికే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలో నీరు నిలిచిపోయి మురుగు రోడ్లపై పొంగి పొర్లుతుందని, రోడ్లన్నీ గుంతలు పడి ఉన్నాయని తెలిపారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మున్సిపల్ స్కూల్, గోరీల దొడ్డ ఖాళీ స్థలంలో చెత్త పేరుకుపోయి వర్షాకాలం పాములు, దోమలు బెడద పెరిగిపోయిందని పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్
- 24 గంటల్లోనే ఫిర్యాదుల పరిష్కారం

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు ప్రత్యేక శ్రద్ధ, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) సహకారంతో ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. నగరంలో ఆయా ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలను రోడ్లపైనా, కృష్ణకాలువలోనూ వేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం హయంలోనే ఏలూరు కార్పొరేషన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇద్దరు సిబ్బంది పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. నగరంలో సుమారుగా 15 ప్రాంతాల్లో అత్యంత ఆధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పాతబస్టాండ్, రైల్వేస్టేషన్ రోడ్డు, కృష్ణకాలువ వెంబడి పలు చోట్లు, టూటౌన్, వన్‌టౌన్ మార్కెట్లు, ఇలా సీసీ కెమెరాలు అమర్చారు.



ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్

వ్యాపారులు, రోడ్లపై చిరు వ్యాపారులు, ప్రజలు రోడ్లు, కాలువలు, డ్రెయినేజీల్లో చెత్త వేయటాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల్లో పర్యవేక్షిస్తారు. పారిశుధ్య కార్మికులకు తెల్లవారుజామునే ఆదేశాలు జారీ చేసేలా ఏర్పాట్లు చేశారు.

సమస్యలపై శ్రద్ధ

గత కొంత కాలంగా ఏలూరు నగరంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవటం, దుర్గంధం వ్యాప్తి చెందుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావటంతో డ్రెయినేజీలు పూడుకుపోయి రోడ్లపైనే మురుగునీరు ప్రవహించటం, రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోతుంది. తాగునీటి సమస్య, వీధి లైట్లు ఇలా పలు సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సత్వర పరిష్కారం



నగర ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. ఫిర్యాదులను 24 గంటల్లోనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం. కమాండ్ కంట్రోల్ నెంబర్ 89789 99955, టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 4287, ల్యాండ్ లైన్ నెంబర్ 08812 232101కు ఫోన్ చేయాలి.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి కృషి



ఆసుపత్రిలో రోగిని పరామర్శిస్తున్న ఎంపీ మహేష్ యాదవ్

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిని మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ఈ ఆసుపత్రిని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాల్లో రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలని, జనరల్ వార్డు నుంచి అన్ని విభాగాలు కూడా ఏసీలు ఉండాలని ఆదేశించారు. అందుకు అవసరమైన బడ్జెట్‌పై మూడు రోజుల్లోగా నివేదికను అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి, టాటా కంపెనీ సహకారంతో నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. వివిధ విభాగాల్లో ఏ ఏ వైద్య పరికరాలు అవసరమో తెలియజేయాలన్నారు. ఏపీ ఎస్ఎంఐడీసీ ఇంజినీర్ రాజబాబు నుంచి ఆసుపత్రి అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి విభాగానికి ఆపరేషన్ చేసే నిమిత్తం వైద్యపరికరాలు అవసరమని డాక్టర్ ఏఎస్ రామ్ చెప్పగా, సమకూరుస్తానని హామీ ఇచ్చారు. తాను ప్రతినెలా ఆసుపత్రిని సందర్శిస్తానన్నారు. అవసరమైన సిబ్బంది, వైద్యులు నియామకానికి సంబంధిత శాఖ నుంచి అనుమతులు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 330 పడకలకు మాత్రమే అనుమతి ఉందని, దీనిని పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు. ట్రామా కేర్ విభాగాన్ని పరిశీలించిన అనంతరం స్టాఫ్ నర్సులు సిబ్బంది ఎంపీ మహేష్ కుమార్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఎంపీ తోపాటు ఆసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ పీఏ ఆర్ఎస్ శ్రీనివాస్, ఆసుపత్రి ఆర్ఎంఓ ప్రసాదరెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, డాక్టర్ రవికుమార్ పలువురు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో కొబ్బరి పీచు పరిశ్రమ

ఏర్పాటుకు చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థకు ఆదాయాన్ని సమకూర్చేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నారు. గతంలోనే ఆదాయ కల్పనకు బీజం పడినా.. ప్రస్తుతం ఆచరణలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. వ్యర్థాలను సక్రమంగా వినియోగిస్తూ కార్పొరేషన్‌కు ఆదాయాన్ని సమకూర్చేలా చిన్న తరహా పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. నగరంల్లో కొబ్బరి బొండాల విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. తాగేసిన కొబ్బరి బొండాలను రోడ్లపైనా, కాలువల్లోనూ, డ్రెయినేజీల్లోనూ పడేస్తూ ఉంటారు. ఇవి వర్షాకాలంలో దోమలకు ఆవాసాలుగా మారుతుంటాయి. వర్షపు నీరు కొబ్బరి బొండాల్లో నిల్వ ఉండిపోవటంతో డెంగీ, మలేరియా కారక దోమలు విపరీతంగా పెరిగిపోతుంటాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతుంటారు.

త్వరలో నిర్మాణ పనులు

ఏలూరులో ప్రతి రోజూ సుమారు 3 వేల నుంచి నాలుగు వేలు వరకు కొబ్బరి బొండాలు విక్రయిస్తుంటారు. ఈ కొబ్బరి డొక్కలతో పీచు, కోకోపిట్ తయారు చేసేందుకు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం కోకో పిట్‌ను ప్లాంటేషన్‌లో విరివిగా వినియోగిస్తుండగా, కొబ్బరి పీచును సోఫాల తయారీ పరిశ్రమలో వినియోగిస్తారు. ఏలూరు శాంతినగర్‌లోని కార్పొరేషన్ స్థలంలో ఈ పరిశ్రమను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి చేయగా, త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు నిర్ణయించామని నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. చిన్న పరిశ్రమ ఏర్పాటుతో ఆదాయంతోపాటు దోమల నివారణ, పర్యావరణ హితంగా ఉంటుందని చెప్పారు.



కొబ్బరి పీచు తయారీ యంత్రం (ఫైల్)

నైతిక జీవన సూత్రాలు తెలిపేవి పద్యాలే

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పిల్లలకు నైతిక జీవన సూత్రాలు తెలిపేవి పద్యాలేనని, ధారణ శక్తి వృద్ధికి, భాషా సౌందర్యం తెలుసుకోవడానికి, ఆత్మవిశ్వాసం కోల్పోతున్న అనేక సందర్భాల్లో ఆత్మవిశ్వాస బీజాల్ని నాటి, వాటిని మహావృక్షాలుగా పెంచేవి పద్యాలని, ప్రతి విద్యార్థీ పద్య పఠనం నిరంతరం చేయాలని హిందీ నికేతన్ అధ్యక్షుడు వి.వెంకటస్వామి అన్నారు. స్థానిక పవర్ పేటలోని హిందీ నికేతన్ వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించారు. వెంకటస్వామి మాట్లాడుతూ నేడు పిల్లలకు పద్యం ప్రాముఖ్యత తెలియడం లేదని, పద్యం యొక్క అవసరాన్ని, ప్రాముఖ్యతను తెలియజేయడానికి హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన హిందీ పండిట్ ట్రైనింగ్ కళాశాల లెక్చరర్ పీఎం మోహన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో పద్య పఠనం వల్ల వ్యక్తిత్వ వికాసం, ఆత్మ చైతన్యం, సాహితీ విలువలతో కూడిన జీవితం అలవడుతుందని అన్నారు. హిందీ నికేతన్ కార్యదర్శి పి.కవితా కుమారి మాట్లాడుతూ హిందీ నికేతన్ వజ్రోత్సవాల సందర్భంగా సంవత్సరమంతా విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థులు జాతీయ భాష హిందీ పట్ల ఆసక్తి చూపించి భాషను అభ్యసిస్తే భారతదేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా భాషా సమస్యలు ఉండవని, ఈ పోటీ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా ఎస్ ప్రతిమ, ఎస్ నందకిషోర్, సీహెచ్ రేవంత్ పొందగా ఎస్ శ్రీ సౌమ్య, ఆర్ ధనరాజ్ ప్రోత్సాహక బహుమతులు పొందారు. కార్యక్రమంలో హిందీ పండితులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



హిందీ పద్య పఠన పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ జన్మదినం

ఏలూరు(మెట్రో): జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ జన్మదిన వేడుక శనివారం ఏలూరు జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, పలువురు నాయకులు పాల్గొని చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్‌ను చైర్‌పర్సన్ పద్మశ్రీ కట్ చేశారు. అభినందనలు తెలిపిన వారిలో బీజీ నాయకుడు గంటా ప్రసాద్, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, పోల్నాటి బాబ్జి, కోరిపల్లి జయలక్ష్మి, కొయ్యే సూర్యారావు, పంపన అంజిబాబు, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, జెడ్పీ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీధర్‌రాజు, ప్రకాష్, నీలిమాదేవి, కుసుమ, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో జన్మదిన కేకు కోస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ, జెడ్పీటీసీలు

● రోడ్డుపైనే మూగజీవాల సంచారం



నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై మూగజీవాల సంచారం ఏలూరు నగరంలో పరిపాటైంది. రాత్రిపగలు అనే తేడా లేకుండా ఈ మూగజీవాలు ప్రధాన కూడళ్లలో రోడ్లపైనే తిష్ట వేస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామని, అయినా నగరపాలక సంస్థ అధికారులు మనకెందుకులే అన్నట్టు వ్యవహరిస్తున్నారని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఏలూరు చేపలతూము సెంటరులో రోడ్డుకు అడ్డంగా తిష్ట వేసిన మూగజీవాల దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	14
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	15
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	04
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	11
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	20
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	11
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	54	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10, 12
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	44-64	కీరా దోస	54
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	170
క్యాబేజీ	38	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-50	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	56	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

రైతులు అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తడిసిన విద్యుత్ స్తంభాలు, తీగలను రైతులు తాకవద్దని విద్యుత్ శాఖ ఏడీఈ త్రివాస్ సూచించారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ వర్షం కురిసినప్పుడు పొలాల్లోని విద్యుత్ మోటార్లను ఆన్ చేయవద్దని రైతులకు సూచించారు. విద్యుత్ స్తంభాలు పొలాల్లో ఒరిగిపోయే పరిస్థితి ఉంటే తక్షణమే ఆయా మండలాల్లో పనిచేస్తున్న విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ తీగలు, మోటార్లు తెగి ఉంటే వాటిని ముట్టుకోకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పూర్తి అప్రమత్తతతో రైతులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కైకరం విద్యార్థినికి స్టూడెంట్ సైంటిస్టు అవార్డు

ఉంగుటూరు: కేవీ రావు సైంటిఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాదులో శనివారం నిర్వహించిన ప్రదర్శనలో ప్రతిభ చూపి స్టూడెంట్ సైంటిస్టు అవార్డును కైకరం జెడ్పీ హైస్కూలుకు చెందిన నెరుసు సుమలత అందుకుంది. ఈ ప్రదర్శనలో ప్రథమస్థానంలో నిలిచిన సుమలత ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావుతోపాటు గైడుగా వ్యవహరించిన సైన్సు ఉపాధ్యాయుడు కూనాటి జాన్‌తో కలిసి అవార్డు అందుకున్నారు. తాటి తోట సాగు ఒక నూతన వ్యవసాయ విధానం అనే ప్రాజెక్టును సుమలత ప్రదర్శించింది. డాక్టర్ ప్రియా అబ్రహం (సీనియర్ ప్రొఫెసర్, క్లినికల్ వైరాలజీ), పలువురు ప్రముఖుల చేతల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్టు ప్రసాదరావు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న నెర్సు సుమలత

సెలవు దినాల్లో తరగతులను అడ్డుకున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న శశి, ఆదిత్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలో రెండో శనివారం క్లాసులు నిర్వహిస్తోన్న పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వద్దకు పీడీఎస్‌యూ నాయకులు వెళ్లి అడ్డుకొని విద్యార్థులను ఇంటికి పంపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కూడా గడవకముందే అప్పుడే ఏలూరులోని కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల హక్కులను కాల రాస్తున్నాయని ఆరోపించారు. రెండో శనివారం సెలవు అయినప్పటికీ యథేచ్ఛగా క్లాసులు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని నాని ప్రశ్నించారు. శశి క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ క్లాస్ నిర్వహిస్తున్నారని ఆర్ఐఓకు ఎన్నిసార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదని నాని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర శాఖ నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రామావతారంలో జగన్నాథుడు



ద్వారకాతిరుమల : రామావతారంలో జగన్నాథ స్వామి వారు శనివారం భక్తజనులకు దర్శనమిచ్చారు. ధనుర్బాణాలను ధరించి సీతాదేవితో కొలువైన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి పూజించారు. పితృవాక్య పరిపాలనతో మానవుడు ఎంత నీతివంతునిగా జీవించవచ్చో తెలియజేసినది రామావతారం. అట్టి రామావతారంలో జగన్నాథుడు శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో దర్శనమివ్వడం భక్తులను అలరించింది.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని హోటల్ గ్రాండ్ ఆర్యాలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో త్రీటౌన్ పోలీసులు దాడి చేశారు. 11 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.50,030 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ఆగ్రో పరిశ్రమలు పెట్టండి, వడ్డీ రాయితీ పొందండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రానున్న కాలంలో ఇథనాల్, బ్యాటరీ కార్లదే హవా అని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో శనివారం జిల్లా రైస్ మిల్లర్లతో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. రైస్‌మిల్లర్లు రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సకాలంలో సొమ్ము చెల్లించాలన్నారు. ఇథనాల్ పరిశ్రమలు నెలకొల్పాలని, ఇందుకు 10 శాతం పెట్టుబడితో 90 శాతం బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తానని, 50 శాతం వడ్డీ రాయితీ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఒక కేపీడీయల్‌కు రూ.ఒక కోటి పెట్టుబడి,100 కేపీడీయల్‌కు 10 ఎకరాల స్థలం కావాలని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీఎస్ ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పైడిపాటి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు కేంద్రంగా పరిశ్రమల జోన్ వస్తుందని అందుకు కావాల్సిన విద్యుత్ ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పీ. సాల్మన్ రాజు, ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక

పెదపాడు: అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బల్లారపు సుజన్ ఇవాంజలిన్, ఎం సాంబశివరావు పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనపడడంతో వారికి ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ సీట్లు కేటాయించింది. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరావు, ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ తదితరులు విద్యార్థులను అభినందించారు.